andhrajyothy.com
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 41.3, కనిష్ఠం 26.4
ఆదిలాబాద్
జిల్లా వార్తలు
5
సోమవారం 28 ఏప్రిల్ 2025



రేపు లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక ప్రక్రియ

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కమిషనర్ ఆఫ్ ప్రొహిబేషన్ అండ్ ఎక్సైజ్ హైదరాబాద్ వారి ఆదేశానుసారం గతంలో రెన్యూవల్ కాని 3 బార్లను అర్హులైన వారికి లాటరీ పద్ధతిన కేటాయించేందుకు నోటిఫికేషన్ వెలువడగా.. 61 దరఖాస్తులు వచ్చాయని జిల్లా అధికారి హిమశ్రీ ఆదివారం తెలిపారు. కాగా, లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక ప్రక్రియను కలెక్టర్ చేతుల మీదుగా ఈనెల 29న ఉదయం 10గంటలకు కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని ఆమె పేర్కొన్నారు.



ఈజీఎస్ పనులు చేస్తున్న కూలీలు

- జిల్లాలో జోరుగా సాగుతున్న భూగర్భ జలాల అభివృద్ధి పనులు
- రూ.194 కోట్ల ఖర్చుతో 29 వేల వివిధ రకాల పనులు
- 2024-25 కాలంలో ఉపాధి పొందిన 81,221 మంది కూలీలు
- ఏపీవోలు, క్షేత్రసహాయకులకు సకాలంలో అందని వేతనాలు

‘ఉపాధి’కి ఊతం

ఉట్నూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామీణ ప్రాంతాల కూలీలకు వరంగా మారింది. గ్రామీణ ప్రాంతాల ప్రజలు పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లకుండా నిరోధించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలోని గ్రామీణ కూలీలకు ఏడాది కాలంగా రూ.194 కోట్లతో పనులు చేయించారు. ఇందులో 81,221 మంది కూలీలకు 2024-25 కాలంలో ఉపాధిని కల్పించారు. జిల్లాలోని 21 మండలాల పరిధిలో ఉన్న 468 గ్రామ పంచాయతీల పరిధిలో గల 2 లక్షల 70 వేల మంది కూలీల కోసం ప్రభుత్వాలు వంద రోజుల పరిధిలో పనులను కల్పించారు. కాగా ఇందులో కేవలం 81 వేల మంది కూలీలు మాత్రమే ఉపాధి హామీ పనులు చేయగలిగారు.

భూగర్భ జలాల అభివృద్ధికి కృషి

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా భూగర్భ జలాలను అభివృద్ధి చేయడంతో రైతులకు సాగు నీరు, ప్రజలకు తాగు నీరు అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం భావిస్తుంది. ఈ పథకం ద్వారా కంటూరు కందకాలు, చెక్ డ్యాములు, ఫారం పండ్స్, మట్టి కట్టలు, పిస్ పండ్స్, కాలువల



ఉపాధి పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు

సరిహద్దు కందకాలు, రీచార్జి గుంతలతో పాటు పశువుల షెడ్లు, పౌల్ట్రీషెడ్లు, తదితర 29 వేల పనులను రూ.194 కోట్ల ఖర్చుతో పూర్తి చేయగలిగారు. ఒక ఉట్నూర్ మండలంలోనే 8,600 పనులు జరగగా.. 960 మంది కూలీలు పనులు చేశారు. రూ.8.60 కోట్లతో కూలీలకు ఉపాధి లభించింది. అంతేకాకుండా గత ఏప్రిల్ నుంచి మార్చి 31 వరకు జరిగిన పనులలో గత మూడు నెలలలోనే అధికంగా పనులు జరగగా.. సరైన సమయానికి కూలీలకు వేతనాలు రాక ఇబ్బందులు పడ్డారు. అయినప్పటికీ రెండు రోజుల క్రితం పూర్తి నిధులు రావడంతో కూలీలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

క్షేత్ర సహాయకులకు వేతన ఇక్కట్లు

గ్రామీణ ప్రాంతాలకు కూలీల కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పనులు కేటాయిస్తున్న క్షేత్రసహాయకులు, ఏపీవోలకు సైతం ప్రభుత్వం సకాలంలో వేతనాలు ఇవ్వడం లేదు. దీంతో ఉపాధి హామీ సిబ్బంది వేతనాల అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతీరోజు ఎండా, వాన అనక కూలీలతో కలిసి పనులు చేయిస్తున్న సిబ్బందికి సకాలంలో వేతనాలు ఇవ్వక పోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఉద్యోగులు పేర్కొంటున్నారు. క్షేత్రసహాయకులకు ఐదు నెలలుగా, ఏపీవోలకు మూడు నెలలుగా వేతనాలు అందడం లేదని తెలుస్తుంది. ప్రభుత్వాలు అమలు చేస్తున్న మహత్తర పథకాన్ని సక్రంగా అమలు చేయిస్తూ ఉపాధి కూలీలకు

(తరువాయి 6వ పేజీలో...)

క్షేత్ర సహాయకులు పనులు కల్పించారు

: పాకాల అరుణ, ఈజీఎస్ కూలీ, ఉట్నూర్



గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఫీల్డ్ అసిస్టెంట్లు మాకు 100 రోజుల పనులు కల్పించారు. దీనిలో భాగంగా వారు చూయించిన పని ప్రదేశంలో పనులు చేయడం ద్వారా మాకు ఉపాధి గిట్టుబాటు అయ్యింది.

సకాలంలోనే కూలీ డబ్బులు వచ్చాయి

: గంగమ్మ, ఉపాధి హామీ కూలీ, ఉట్నూర్



అధికారుల ఆదేశాల మేరకు కూలీలం అందరం కలిసి ఉపాధి హామీ పనులు చేయడం ద్వారా సకాలంలో ఉపాధి డబ్బులు వచ్చాయి. వేసవి కాలంలో పనులు దొరకక ఇతర ప్రాంతాలకు వలస పోకుండా స్థానికంగానే పనులు లభించడంతో పనులు చేసుకున్నాం.

క్షేత్రసహాయకుల వేతనాలు ఇవ్వాలి

: మానాల సతీష్, ఫీల్డ్ అసిస్టెంట్, బీర్సాయిపేట



జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు శరవేగంగా చేయిస్తూ కూలీలకు ఉపాధి కల్పిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు సైతం ప్రభుత్వం సకాలంలో వేతనాలు ఇవ్వాలి. జిల్లాలో 240 మంది క్షేత్ర సహాయకులు పని చేస్తుండగా ఐదు నెలలుగా వేతనాలు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం కనుకరించి వేతనాలు చెల్లించాలి.

ఫటా..ఫట్...

సుంకం చెల్లించకుండా మద్యం విక్రయించడం నేరం

● జుల్ఫీకర్ అహ్మద్, సీఐ, అబ్కారీ శాఖ



ఆంధ్రజ్యోతి: మహారాష్ట్ర నుంచి తీసుకువచ్చే సుంకం లేని మద్యం విక్రయిస్తే ఏం చర్యలు తీసుకుంటారు?

సీఐ: సుంకం చెల్లించని మద్యంను తీసుకువచ్చిన, విక్రయించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. వారికి జరిమానాతో పాటు న్యాయాధికారి అనుమతితో జైలు శిక్షను విధించడం జరుగుతుంది. ఎట్టి పరిస్థితుల్లో మహారాష్ట్ర మద్యంను తెలంగాణలో విక్రయించారు.

ఆంధ్రజ్యోతి: వైన్స్‌లు సమయపాలన పాటించక పోతే ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సీఐ: వైన్స్‌ల సమయం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే తెరచి ఉంచాలి. ఉదయం తొందరగా తెరిచినా.. రాత్రి ఆలస్యంగా మూసివేసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. వైన్స్ లైసెన్స్‌లో ఇచ్చిన సమయం ప్రకారం మాత్రమే దుకాణాలను నడిపించాలి.

ఆంధ్రజ్యోతి: గొలుసు దుకాణాల్లో లుజ్ లిక్కర్ విక్రయిస్తున్నట్లు సమాచారం. అలాంటి వాటిపై ఎలాంటి చర్యలు చేపడతారు?

సీఐ: లైసెన్స్‌డ్ మద్యం దుకాణాల్లో మాత్రమే మద్యం సీసాలను విక్రయించాలి. ఒక సీసాలో నుంచి మరొక సీసాలోకి క్వార్టర్ల రూపంలో లూజ్ లిక్కర్ అమ్మడం నేరం. అమ్మితే వారి లైసెన్సులు రద్దు చేస్తాం. బెల్టు దుకాణాలు నడపడమే నేరం.. అందులో లూజ్ లిక్కర్ అమ్మితే శాఖాపరమైన కేసులు అమలు చేస్తాం. ఇలాంటివి మా దృష్టికి రాలేదు.

ఆంధ్రజ్యోతి: గంజాయి సరఫరా చేసే వారిపై చర్యలేంటి?

సీఐ: గంజాయి అమ్మిన, పంపిణీ చేసిన సరఫరా చేసినవారిపై కేసులు కట్టడమే కాకుండా నేరుగా రిమాండ్‌కు తరలిస్తున్నాం. సరఫరా చేసే వాహనంతో పాటు ఫోన్‌ను కూడా సీజ్ చేస్తాం. గ్రామాల్లో గంజాయి విక్రయించిన, తరలించిన వారి వివరాలు అబ్కారీ అధికారులకు తెలియజేయాలి. తెలియజేసిన వారి వివరాలను గొప్యంగా ఉంచడం జరుగుతుంది. సమాచారం అందజేయాలని గ్రామాల్లో సైతం అవగాహన కల్పించాం.

- ఇచ్చోడ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి)

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ సీవీఎస్ రాజు తెలిపారు. ఇందిరమ్మ కమిటీ వారు సిఫారసు చేసినప్పటికీ అనర్హులు ఉంటే వారిని తొలగించి అర్హులను మాత్రమే ఎంపిక చేయడం జరుగుతుంది. ఎవరైనా ఇట్టి ఎంపికలో డబ్బులు అడిగిన యెడల మాకు తెలియజేయాలని. ఇందిరమ్మ కమిటీ లపై ఇలాంటి ఆరోపణలు వస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

ఎన్‌సీటీఈ మెంటర్‌గా డైట్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధ్యాయ శిక్షణ సంస్థ(ఎన్‌సీటీఈ) న్యూఢిల్లీ మిషన్ ఫర్ మెంటరింగ్ మెంటర్‌గా ప్రభుత్వ డైట్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కోల కిరణ్ కుమార్ నామినేట్ అయ్యారు. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు ఏ విధంగా విద్యాబోధన చేయడం, వారి మానసిక పరిపక్వత బోధన, నూతన జాతీయ విద్యా విధానంలో వస్తున్న మార్పులు, తదితర అంశాలపై జాతీయ స్థాయిలో శిక్షణ ఇవ్వనున్నారు. ఆయన జిల్లా నుంచి మెంటర్‌గా ఎంపిక కావడం పట్ల డైట్ కళాశాల పూర్వ విద్యార్థులు, ఛాత్రోపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.



మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ఎంపీ నగేష్

ప్రజలను ఉత్తేజపరుస్తున్న మన్ కీ బాత్ : ఎంపీ గోడం నగేష్

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన మన్‌కీ బాత్ కార్యక్రమం దేశ ప్రజలను ఉత్తేజపరుస్తుందని ఎంపీ గోడం నగేష్ అన్నారు. మండలంలోని పిట్టబొంగురం గ్రామంలో ఆదివారం ఆయన 'మన్‌కీ బాత్' కార్యక్రమాన్ని మండల బీజేపీ నాయకులతో కలిసి వీక్షించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ మన్‌కీ బాత్ కార్యక్రమం చాలా గొప్పదని, వివిధ రాష్ట్రాల ప్రజలు వేర్వేరు అంశాలపై వారి అనుమానాలను, సూచనలను ప్రధానితో పంచుకుంటారన్నారు. రైతులు సమస్యలపై ప్రధాని నరేంద్రమోదీ దృష్టి సారించారు. ఇందులో బీజేపీ శ్రేణులు ప్రధాని మాట్లాడిన విషయాలను ప్రజలకు వివరించి అర్థమయ్యేలా చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆరెల్లీ రాజలింగం, ప్రధాన కార్యదర్శి రాథోడ్ భీంరావ్, నాయకులు దేవపూజ్ మారుతి, దీపిక్ సింగ్ శేకవత్, మోరే దిలీప్, మాస్కే రాజవర్దన్, కోవా రాజేశ్వర్, మెస్రం తుకారం, కనక హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

‘సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం’

నేరడిగొండ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. ఆదివారం నేరడిగొండ మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఇచ్చోడ మండలంలోని తలమద్రి గ్రామానికి చెందిన బొంగురాల అడెల్లు రూ. 55,000, బోథ్ పట్టణ కేంద్రానికి చెందిన అశోక్ రూ. 60,000 వేల వైద్య ఖర్చుల కోసం మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

భూభారతితో శాశ్వత పరిష్కారం

● జూన్ 2 నుంచి భూభారతి పోర్టల్ అమలు : జిల్లా కలెక్టర్ రాజర్షి షా ● ఇచ్చోడ, సిరికొండలలో రైతులకు అవగాహన సదస్సు



ఇచ్చోడలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా



సిరికొండలో రైతుల సమస్యలను తెలుసుకుంటూ..

ఇచ్చోడ, ఏప్రిల్, 27 (ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టంతో రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ధరణి పోర్టల్ స్థానంలో ఈ చట్టాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందని రైతులకు వివరించారు. ఈ అవగాహన సదస్సులో జ్యోతి ప్రజ్వలన గావించి జయ జయహే తెలంగాణ పాటతో కార్యక్రమాన్ని ప్రారంభించిన పాలనాధికారి రైతులు విన్నవించిన సమస్యలకు పరిష్కార దిశగా సలహాలు సూచనలు అందించారు. ఈనెల 17వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జిల్లాలోని అన్ని మండలాల్లో కొత్త చట్టం అమలు భూ భారతి చట్టంపై రైతులకు, ప్రజలకు అవగాహన సదస్సులు ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించడం జరిగిందన్నారు. కొత్త చట్టంపై అందరికీ అవగాహన ఉండాలని, అధికారులు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారన్నారు. పాంప్లెంట్స్‌లో అన్ని వివరాలతో అర్థమయ్యేలా ఉన్నాయని రైతులు జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. ధరణి పోర్టల్ వల్ల పేద ప్రజలు, రైతులు ఎంతో నష్టపోయారని, భూసమస్యల పరిష్కారం కోసం రైతులు తహసీల్దార్, ఆర్డీవో, జిల్లా కలెక్టర్, సిసిఎల్ఏ కార్యాలయాలు, కోర్టులు, పోలీస్ స్టేషన్‌ల చుట్టు తిరిగి కష్టపడ్డారన్నారు. ముఖ్యంగా త్వరితగతిన రైతుల కష్టాలు తీర్చేందుకే ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. ఇకపై భూ సమస్యలకు పరిష్కారం తహసీల్దార్ కార్యాలయంలోని పరిష్కరించబడతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్యామలదేవి మాట్లాడతూ.. ఈ చట్టంలో రైతుల భూములను ఆక్రమించుకునే అధికారం ఎవ్వరికిలేదని అలా లేకుండా ఉండేందుకే రైతుకు భూదార్ కార్డును ఇవ్వడం జరుగుతందన్నారు. సాదాబైనామా సమస్యలను పకడ్బందీగా పరిష్కారిస్తామని పేర్కొన్నారు. భూ భారతి పోర్టల్ జూన్ 2 నుంచి అమలులోకి వస్తుందన్నారు. ఇందులో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, ఇచ్చోడ ఎఎమ్‌సీ చైర్మన్ సత్యవతి, ఆర్డీఓ వినోద్‌కుమార్, ఎంఆర్‌ఓ సత్యనారాయణ, నాయబ్ తహసీల్దార్ జాదవ్ రమేష్, ఎంపీడీఓ లక్ష్మణ్, ఆర్ఐ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

● **రైతుల సమస్యలు పరిష్కరించడానికే..**

సిరికొండ: రైతుల భూ సమస్యలు పరిష్కరించడానికే భూభారతి చట్టాన్ని ప్రభుత్వం తీసుకువచ్చింది అని జిల్లా కలెక్టర్ రాజార్షిషా అన్నారు. ఆదివారం భూభారతి చట్టంపై సిరికొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన గావించి రైతులు విన్నవించినా సమస్యలకు పరిష్కారం దిశగా సలహాలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జిల్లాలోని అన్ని మండలాల్లో కొత్త చట్టం అమలు భూభారతి చట్టం పై ప్రజలకు, రైతులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. అటవీ హక్కు చట్టం ప్రకారం గిరిజన రైతులు 13 డిసెంబరు 2005 నాటికి కాస్తులో ఉంటేనే వారికి అటవీ హక్కు పత్రాలు ఇవ్వడం జరుగుతుంది అని, దాని తర్వాత కాస్తులో వచ్చిన వారికి హక్కు పత్రాలు ఇవ్వడానికి అస్కారం లేదని పలు అంశాలపై కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఆర్డీఓ వినోద్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ కుమ్ర సత్యవతి కోటేష్, డీఎల్‌పీఓ ఫణిందర్, డీటీ ఉపేందర్, తహసీల్దార్ తుకారాం, ఎంపీడీఓ రవీందర్, ఏఓ శ్రద్ధారాణి, ఐకేపీ ఏ పీఎం సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



రక్త మార్పిడి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా వైద్యాధికారి

నార్నూర్‌లో రక్త మార్పిడి కేంద్రం ప్రారంభం

నార్నూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ 30 పడకల ఆస్పత్రిలో ఆదివారం జిల్లా వైద్య అధికారి నరేందర్ రాథోడ్ రక్త మార్పిడి కేంద్రాన్ని ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఝరి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిధి మలేపూర్ సబ్ సెంటర్ గ్రామానికి చెందిన 16 ఏళ్ల యువతికి రక్త మార్పిడి చేయడం జరిగిందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రాంబాబు, సంజీవ్, స్టాఫ్ నర్స్‌లు పాల్గొన్నారు.

నేటి నుంచి జొన్నల కొనుగోళ్ల నిలిపివేత

తాంసి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కొనుగోలు చేస్తున్న జొన్నల కొనుగోలను సోమవారం నుంచి బుధవారం వరకు కొనుగోలు నిలిపివేస్తున్నట్లు సీఈవో ఒక ప్రకటన పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రం వద్ద అత్యధికంగా జొన్నలు రావడం వల్ల కొనుగోలు నిలిపివేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ విషయంలో రైతులు తమకు సహకరించాలని ఆయన కోరారు. తిరిగి మే 1 నుంచి కొనుగోలు యధావిధిగా కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు. గ్రామాల వారీగా ప్రకటించిన తేదీలలో వారి వారి జొన్నలు తీసుకురావాలని ఆయన కోరారు.

నేడు ‘భూభారతి’పై అవగాహన సదస్సు

తాంసి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతి ష్టాత్మకంగా ప్రారంభించిన భూభారతి చట్టంపై సోమవారం తాంసి మండల కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ రాజార్షి షా ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. రెవెన్యూ శాఖ అధికారులు ఆయా గ్రామాలలో ఈ కార్యక్రమం పై అంతగా ప్రచారం చేయకపోవడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికార పార్టీ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు.

రేపు కాన్పమేడిగూడ (సి)లో..

జైనథ్: జైనథ్ ఉమ్మడి మండలంలోని సాత్నాల మండల పరిధిలోని కాన్పమేడిగూడ (సి) జడ్పిఎస్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 29న భూభారతి ఆర్ఓఆర్ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు సాత్నాల మండల తహసీల్దార్ మడావి విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ రాజార్షిషా, ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయలశంకర్‌లు హాజరుకానున్నట్లు తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు నిర్వహించే ఈ అవగాహన కార్యక్రమానికి రైతులు రైతు కూలీలు వివిధ కుల సంఘాల సభ్యులు ప్రజలు, మేధావులు గిరిజనులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని సాత్నాల మండల తహసీల్దార్ పేర్కొన్నారు.

నేటి ‘ప్రజా ఫిర్యాదుల విభాగం’ వాయిదా

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల విభాగం కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాజార్షిషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న భూభారతి చట్టం అవగాహన కార్యక్రమాలు ఈ నెల 30 వరకు కొనసాగనున్నాయన్నారు. కాగా సోమవారం యాపల్‌గూడ, తాంసిలో భూభారతి చట్టం అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతున్న దృష్ట్యా ప్రజా పిర్యాదుల విభాగాన్ని రద్దు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి కలెక్టరేట్‌కు రాకూడదని కలెక్టర్ పేర్కొన్నారు.

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

● పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన డీఈవో

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్లో 6వ తరగతితో పాటు 6 నుంచి 10వ తరగతి వరకు ప్రవేశల కోసం నిర్వహించిన అర్హత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. విద్యార్థుల కోసం రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారు. పాత హౌజింగ్ బోర్డులోని సరస్వతి శిశుమందిర్, బంగారుగూడలోని మోడల్ స్కూల్లో కేంద్రాలను ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్‌లలో పరీక్షలు జరిగాయి. కాగా సరస్వతి శిశుమందిర్ పరీక్ష కేంద్రాన్ని డీఈఓ ఎ.శ్రీనివాసరెడ్డి తనిఖీ చేసి ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఉదయం 6వ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్షకు 1059 మంది దరఖాస్తులు చేసుకోగా 879 హాజరు కాగా 180 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. అదే విధంగా 6 నుంచి 10వ తరగతి ఖాళీ సీట్ల కోసం మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 774 దరఖాస్తులు చేసుకోగా 629 హజరై 145 మంది గైర్హాజరైనట్లు డీఈఓ పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు వారిని కేంద్రాలకు వదిలి పరీక్ష పూర్తి అయ్యే వరకు అక్కడే ఉన్నారు.

గుడిహత్నూర్: మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశం కోసం ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఆరో తరగతిలో మొత్తం 116 మంది విద్యార్థులకు వంద మంది విద్యార్థులు హాజరై రాశారు. 16 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష జరిగింది. అలాగే 7 నుంచి 10వ తరగతిలో ప్రవేశాలకు 48 మంది విద్యార్థులకు 34 మంది విద్యార్థులు హాజరయ్యారు. 14 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ సూరజ్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 7 నుంచి 10వ తరగతి ప్రవేశ పరీక్ష జరిగింది.



గుడిహత్నూర్ మోడల్ స్కూల్‌లో పరీక్ష రాస్తున్న విద్యార్థులు


సాయిచైతన్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సాయిచైతన్యకు అభినందనల వెల్లువ

ఉట్నూర్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో ఐఏఎస్ 68వ ర్యాంకుసాధించిన జాదవ్ చైతన్యకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. టీటీఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జాదవ్‌చంద్రకాంత్‌జాతీయ స్థాయిలో 68వ ర్యాంకు సాధించిన బంజారా ఆణిముత్యం జాదవ్ చైతన్యను ఆదివారం శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా చంద్రకాంత్‌నాయక్ మాట్లాడుతూ సాయిచైతన్య ఐఏఎస్ సాధించి బంజారా జాతికి గౌరవాన్ని తెచ్చారన్నారు. ఇదే విధంగా జాతిలోని అందరు విద్యార్థులు యువకులు చైతన్యని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సాయి చైతన్య ఐఏఎస్ కావడానికి ఎంతో కృషి చేసిన తల్లిదండ్రులు జాదవ్ గోవింద్ కవిత దంపతుల శ్రమ విశేషం అన్నారు. ఈ కార్యక్రమంలో టీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు జాదవ్ రవీందర్, జిల్లా నాయకులు జాదవ్ మురళి, రాథోడ్ గజేందర్, రాథోడ్‌గణేష్,దిగంబర్,రవీందర్,పవర్‌బంజారా నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా బంజారా సేవ సంఘం నాయకుల ఆధ్వర్యంలో సాయిచైతన్యను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జముననాయక్, భానోత్‌జగన్, నేతావత్ రాందాస్, రామారావు, శ్రీరామ్‌నాయక్,రాథోడ్ శేషరావు, రాజేశ్‌నాయక్, విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

తర్నం బ్రిడ్జి తొలగింపు పనుల ప్రారంభం

జైనథ్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): జైనథ్ ఉమ్మడి మండలంలోని సాత్నాల నదిపై ఉన్న తర్నం బ్రిడ్జిను ఆదివారం ఆర్అండ్‌బి నేషనల్ హైవే అధికారులు తొలగింపు పనులను ప్రారంభించారు. 2023 సంవత్సరంలో బ్రిడ్జికి బీటలు రావడంతో రాకపోకలను నిలిపి వేశారు.దీంతో జైనథ్ బేల మండలాలతో పాటు పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర ప్రజలకు వంతెన పై నుంచి రాకపోకలు నిలిచి పోయాయి. ఇటీవల జాతీయ రహదారి పనుల్లో భాగంగా కొత్తబ్రిడ్జి నిర్మాణానికి పాత బ్రిడ్జిని ఆదివారం అధికారులు డిటోనెటర్లతో బ్రిడ్జిని తొలగిస్తున్నారు.ఈ బ్రిడ్జి తొలగింపును ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే అధికారులు పాల్గొన్నారు.

'ప్రతీ పోషకుడు టీకాలను వేయించాలి'

నేరడిగొండ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక పోషకుడు ఉచిత టీకాలను వేయించాలని పశువైద్యాధికారి రాథోడ్ జీవన్ అన్నారు. ఆదివారం మండలంలోని కోర్టికల్‌లో పాడి రైతుల ఆవులకు గేదెలకు గాలికుంటు నివారణ టీకాలు వేసారు. నెలరోజుల కార్యక్రమంలో భాగంగా ఆవులకు గేదెలకు ఎటువంటి వ్యాధులు రా కుండా ఉండడానికి పశువులకు గేదెలకు గాలికుంటు నివారణ టీకాలు వేయడం జరుగుతుందన్నారు. ఉచిత గాలికుంటు నివారణ టీకాలను రైతులు, పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి రాథోడ్ జీవన్ కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఇళ్లను పరిశీలించిన ఎంపీడీవో

బోథ్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొచ్చెర గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లను ఎంపీడీవో రమేష్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఆర్థిక స్థితిగతులను పరిశీలించి వారి వివరాలను సేకరించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని, ఇందిరమ్మ కమిటీ వారు ప్రతిపాదించిన ఇళ్ల లబ్ధిదారుల ఇంటి స్థలాలను కొలతలు తీయడం జరిగింది. త్వరలోనే చిన్న నిర్మాణం ప్రారంభమవుతుందని వివరించారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శి డి.చిన్న గంగయ్య, ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు కమిటీ వారు ఉన్నారు.

ప్రజలు బీఆర్ఎస్ వైపు చూస్తున్నారు

● మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రంగినేని మనీషాపవన్‌రావు ● ఆదిలాబాద్ జిల్లా నుంచి వరంగల్ సభకు తరలిన పార్టీ శ్రేణులు

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేకతతో బీఆర్ఎస్ పార్టీకి ఆదరణ పెరుగుతోందని ఆదిలాబాద్ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రంగినేని మనీషాపవన్‌రావు అన్నారు. ఆదివారం వరంగల్ ఎల్కతుర్తిలో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులతో కలిసి బయలుదేరారు. ముందుగా పట్టణంలోని మోచిగల్లీలో బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించి ప్రత్యేక వాహనంలో వరంగల్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్థరహితంగా ఉన్నాయని ఆరోపిస్తూ ప్రజలు బీఆర్ఎస్ పార్టీ వైపు చూస్తున్నారని అన్నారు. అదే విధంగా 14ఏళ్ల చేసిన పోరాటాన్ని, అధికారంలో పదేళ్ల ప్రభుత్వాన్ని నడిపిన వ్యవహారాన్ని, ఏడాదిన్నరగా ప్రతిపక్ష హోదాలో ప్రజల పక్షాన నిలబడిన తీరును ప్రజలు ప్రశంసిస్తున్నారని పేర్కొన్నారు. ఎల్కతుర్తిలో నిర్వహిస్తున్న సభకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివెళ్తున్నారని తెలిపారు. 24 వసంతాలు పూర్తి చేసుకుని 25వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న సభను విజయవంతం చేస్తామని అన్నారు.

ఉట్నూర్: బీఆర్ఎస్ ఆవిర్భవించి పాతిక సంవత్సరాలు పూర్తి చేసుకున్నందున మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఉన్న బీఆర్ఎస్ గద్దెపై ఉట్నూర్ మాజీ మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్ రావు ఆధ్వర్యంలో ఆదివారం జెండా ఆవిష్కరించి బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. అనంతరం వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలకు ఆర్టీసీ బస్సులు, జీపులు, కార్లలో బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు కదిలి వెళ్లారు.

బోథ్: వరంగల్లో జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలు విజయవంతం చేసేందుకు నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. ఆయా గ్రామాలలో పార్టీ జెండాలను ఎగురవేసిన అనంతరం ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి అక్కడ ఎమ్మెల్యేతో కలిసి నృత్యాలు చేశారు. ఎమ్మెల్యే పార్టీ శ్రేణులు మరింత ఉత్సాహం నింపే విధంగా డీజే పాటలకు స్టెప్పులు వేస్తూ భారీ కాన్వాయితో తరలి వెళ్లారు.


ఇంద్రవెల్లి నుంచి తరలి వెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

ఇంద్రవెల్లి: వరంగల్ జిల్లాలో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ రజతోత్సవ పండుగకు ఆదివారం ఇంద్రవెల్లి బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ డోంగ్రే మారుతి పటేల్ ఆధ్వర్యంలో గులాబీ శ్రేణులు భారీగా కదిలారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీల సుమోలు, ఇతర వాహనాల్లో తరలి వెళ్లారు.

ఇచ్చోడ: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో ఆదివారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్ పార్టీ జెండాలను ఎగరవేశారు. ఆ తర్వాత టపాసులు కాల్చి వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభ కార్యక్రమానికి పార్టీ నాయకులు అధిక సంఖ్యలో తరలలి వెళ్లారు. దీనిలో భాగంగా కార్లు, జీపులు, బస్సులను గులాబీ జెండాలతో అందంగా అలంకరించి బయలుదేరి వెళ్లారు.

అదేవిధంగా, నార్నూర్, గాదిగూడ, సిరికొండ, జైనథ్ మండలాల నుంచి వరంగల్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పార్టీ రజతోత్సవ సభకు ఆయా గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు వెళ్లారు.

ఉట్నూర్‌లో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ

ఉట్నూర్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): జమ్ము కాశ్మీర్‌లోని పహాల్గాంలోహిందు యాత్రికుల పై జరిపిన ఉగ్రదాడి, మరణకాండను ఖండిస్తూ కొవ్వొత్తుల శాంతి ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి వినాయకచౌక్ వరకు కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించి మృతి చెందిన వారికి నివాళులు ఘటించారు. ఈ కార్యక్రమంలో జాతీయ వాదులతో పాటు కులాల కతీతంగా ప్రజలు పాల్గొని మృతులకు శ్రద్ధాంజలి ఘటించి సంఘీబావం తెలిపారు.

● మృతుల కుటుంబాలకు సంఘీభావంగా..

ఆదిలాబాద్ రూరల్: పహాల్గాంలో హిందువులే లక్ష్యంగా జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ మృతుల కుటుంబాలకు సంఘీభావంగా గాంధీపార్క్ యోగ టీం సభ్యులు ఆదివారం ఆదిలాబాద్‌లో సంఘీబావం ర్యాలీ నిర్వహించారు. దాడికి పాల్పడిన ఉగ్రవాదులను, వారికి మద్దతు ఇస్తున్న వారిని కఠినంగా శిక్షించాలి అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ర్యాలీలో గౌలి సంజయ్, సాయి ప్రసాద్, రమేష్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.


సంఘీభావ ర్యాలీ నిర్వహిస్తున్న యోగ టీం సభ్యులు

'అసాంఘిక శక్తులకు దూరంగా ఉండాలి'

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): అసాంఘిక శక్తులను దరిచేరనివ్వకుండా కాలనీవాసులు దూరంగా ఉండాలని ఆదిలాబాద్ టూ టౌన్ సీఐ కరుణాకర్ రావు సూచించారు. ఆదిలాబాద్‌లోని చిలుకూరి లక్ష్మీనగర్ పోలీసులు మీకోసం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దొంగతనాలు, సైబర్ క్రైమ్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. ప్రతి ఇంటికి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో సీఐతో పాటు కానిస్టేబుళ్లు నరేష్, క్రాంతి పాల్గొన్నారు.

ఆనంద్‌పూర్‌లో ఇసుక టిప్పర్ పట్టివేత

జైనథ్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): జైనథ్, బేల, భీంపూర్ మండల పరిధిలోని పెన్‌గంగా నది నుంచి ఇసుక అక్రమ రవాణా పై ఉక్కుపాదం మోపుతామని జైనథ్ రూరల్ సీఐ డి.సాయినాథ్ అన్నారు. ఆదివారం జైనథ్ మండలంలోని ఆనంద్‌పూర్ గ్రామం పెన్‌గంగానది నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతుందన్న విశ్వసనీయ సమాచారం మేరకు సీఐ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో కలిసి దాడి చేశారు. నెం. టీజీ 01టీ0365 గల ఇసుక టిప్పర్‌ను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా టిప్పర్ ఓనర్ తాటిపల్లి కరుణాకర్ రావు, ఇసుక రవాణా చేసే కరణ్ రెడ్డి, డ్రైవర్ నైతం మారుతిలపై ఇసుక దొంగతనం, సెక్షన్ 3 ఆఫ్ పీడీపీపీ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ సాయినాథ్ మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు ఎలాంటి అసాంఘిక కార్యకలపాలను జరగనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జైనథ్ ఎస్సై వి.పురుషోత్తం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి'కి ఊతం

(5వ పేజీ తరువాయి...)

పనులను చూపిస్తున్న ఉద్యోగులకు వేతనాలు వెంటనే చెల్లించాలని వారు కోరుతున్నారు. జిల్లాలో 240 మంది క్షేత్ర సహాయకులు కేవలం నెలకు రూ.12వేల జీతంపై ఆధారపడి జీవిస్తున్నందున వారికి వెంటనే వేతనాలు చెల్లించాలని పరిశీకులు అంటున్నారు.

పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు

ఉట్నూర్ మండలంలోని గ్రామీణ ప్రాంతాల కూలీలు ఉపాధి హామీ పథకం ద్వారా చేస్తున్న పనులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అదనపు డీఆర్‌డీవోతో పాటు ఉట్నూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాంప్రసాద్, ఈజీఎస్ ఏపీవో రజనికాంత్‌లో పనులు పర్యవేక్షిస్తూ ఉపాధి పనులను వేగిరంగా చేయడంతో కూలీలకు కలిసి వచ్చిందంటున్నారు.

సరిహద్దు చెక్‌పోస్టు వద్ద 16 లీటర్ల మహారాష్ట్ర మద్యం పట్టివేత

బోథ్/ సోనాల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న ఘనపూర్ చెక్ పోస్టు వద్ద శనివారం సాయంత్రం 16 లీటర్ల మహారాష్ట్ర మద్యంతో వస్తున్న బజార్‌హత్నూర్ గ్రామానికి చెందిన తోట త్రిశూల్ అనే వ్యక్తిని పట్టుకొని కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ సీఐ జుల్ఫికర్ అహ్మద్ తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ 19,200 ఉందని వివరించారు. మహారాష్ట్ర మద్యాన్ని అక్రమంగా తీసుకొస్తున్న ఈయనపై కేసు నమోదు చేసి మద్యం సీజ్ చేయడం జరిగిందన్నారు. అయితే మహారాష్ట్ర మద్యాన్ని ఎవరైనా తీసుకువచ్చి విక్రయిస్తే కేసులు తప్పవని ఆయన పేర్కొన్నారు.

మోటార్ సైకిల్, వ్యాన్ ఢీకొని ఒకరి మృతి

బోథ్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ధనుర్ గ్రామానికి చెందిన రాకేష్ రెడ్డి (35) సంవత్సరాలు అనే వ్యక్తి మృతి చెందాడు. ఇందుకు సంబంధించిన వివరాలు బోథ్ ఎస్సై ప్రవీణ్ తెలిపిన ప్రకారం ఇలా ఉన్నాయి. బోథ్ నుండి మోటార్ సైకిల్ పై ధనుర్ గ్రామానికి వెళుతున్న రాకేష్ రెడ్డి ఎదురుగా వస్తున్న మ్యాక్స్ వ్యాన్ ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలయ్యారు. వెంటనే బోథ్ ఆసుపత్రికి తరలించగా అక్కడి నుండి నిర్మల ఆసుపత్రికి మెరుగైన వైద్యం కోసం తరలిస్తుండగా మృతి చెందడం జరిగిందని ఎస్ఐ వివరించారు. అంతేగాక మోటార్ సైకిల్ వెనుక కూర్చున్న ముత్యం రాజు అనే వ్యక్తికి సైతం స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం : సీఐ

బేల, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడ ఎలాంటి అక్రమ దుందాలు, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించిన కఠిన చర్యలు తీసుకోవాలన్న ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ ఐపీఎస్ ఆదేశాల మేరకు అదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో జైనథ్ సీఐ డి.సాయినాథ్, బేల ఏఎస్సై జీవన్, పోలీస్ సిబ్బంది కలిసి ఈనెల 26న బేల మండలం కంగార్పూర్ గ్రామంలో పెనుగంగ నది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం మేరకు రాత్రి 11 గంటల సమయంలో కంగార్పూర్ నుంచి నార్నూర్‌కు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఇసుక టిప్పర్ టీఎస్02యూఏ7521ను సీజ్ చేసి టిప్పర్ ఓనర్ కృష్ణ, డ్రైవర్ బానుదాస్‌పై ఇసుక దొంగతనం, పీడీపీపీ ఏసీటీ కింద కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. కావున అక్రమ దుందాలు నిర్వహించే వారిపై ఉక్కుపాదం మోపుతున్నట్లు సీఐ సాయినాథ్ తెలిపారు. ఇలాంటి కార్యకలాపాలు ఎవరు నిర్వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.


సీజ్ చేసిన టిప్పర్

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు

● భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్


భైంసాలో వాహనం నడుపుతున్న బాలుడిని పట్టుకున్న పోలీసులు

భైంసా, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మైనర్లకు వాహనాలు ఇస్తే చట్టపరమైన చర్యలు తప్పవని భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ వెల్లడించారు. ఆదివారం మున్సిపల్ కేంద్రమైన భైంసాలోని ప్రధాన కూడలీల్లో పోలీసు శాఖ చేపట్టిన వాహనాల తనిఖీల్లో పాల్గొని మాట్లాడారు. తనిఖీల్లో ఎక్కువగా మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారితోపాటు సంబంధిత వాహన యజమానిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తల్లితండ్రులు మైనర్ పిల్లలకు ఎలాంటి పరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. భైంసా టౌన్ సీఐ గోపినాథ్, ఎస్ఐ అజయ్‌లు ప్రధాన కూడలీల్లో తనిఖీలు చేపట్టి మైనర్లు నడుపుతున్న 100కు పైగా ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. వాహనాలు నడిపిన మైనర్ల తల్లితండ్రులను, వాహనాల యజమానులకు సీఐ గోపినాథ్ పోలీసుస్టేషన్‌లో కౌన్సిలింగ్ ఇచ్చారు.

దిలావర్‌పూర్: మైనర్లకు వాహనాలిస్తే ఏది జరిగినా తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందని దిలావర్‌పూర్ ఎస్సై లోకసందీప్ హెచ్చరించారు. ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాలతో ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ మైనర్లను అదుపులోకి తీసుకుని వారి తల్లిదండ్రులను పోలీస్‌స్టేషన్ పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడంతో అమాయకుల ప్రాణాలకు ప్రమాదం ఉందన్నారు. లైసెన్స్ లేకుండా, రాష్‌గా డ్రైవింగ్ చేస్తే వారి ప్రాణాలతోపాటు ఎదుటివారి ప్రాణాలు రిస్క్‌లో పెడుతున్నారన్నారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని కుస్లి కూడలి వద్ద స్థానిక ఎస్సై సాయికిరణ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడడంతో తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై సాయికిరణ్ మాట్లాడుతూ 18 ఏళ్లలోపు వాహనం నడపడం నేరమని, మోటార్ వెహికల్ చట్టం 1988 ప్రకారం మైనర్ డ్రైవింగ్ చేస్తే, వాహనయజమాని, తల్లిదండ్రులు కూడా బాధ్యత వహించాలన్నారు. చట్టపరమైన పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుందన్నారు.

లక్ష్మణచాంద: మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని ఎస్సై రహమాన్ మాలిక్ ఆదివారం హెచ్చరించారు. వాహనాలు డ్రైవింగ్ చేస్తున్న మైనర్లను గుర్తించి వారి తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కి తీసుకువచ్చి కౌన్సిలింగ్ ఇచ్చారు. మోటార్ వెహికల్ చట్టం గురించి, మైనర్‌కి వాహనాలు ఇస్తే జరిగే ప్రమాదాల గురించి వివరించారు. ఈ చట్టంను ఉల్లంఘించి మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామన్నారు. కాబట్టి తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

లోకేశ్వరం: మండల కేంద్రంతో పాటు పుష్పూర్, కాండ్లీ, హవర్గా గ్రామాల్లో ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇందులో భాగంగా మైనర్లు డ్రైవింగ్ చేస్తున్నటువంటి వాహనాలను సీజ్ చేసి మైనర్లకు, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించి వాహన యజమానిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా లోకేశ్వరం ఎస్సై అశోక్ మాట్లాడుతూ మండల ప్రజలందరూ ఎట్టి పరిస్థితుల్లో మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని అన్నారు. అంతేకాకుండా వాహనానికి సంబంధించిన అన్నిరకాల పత్రాలను ఉంచుకోవాలని లోకేశ్వరం ఎస్సై తెలిపారు.

భైంసారూరల్: నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జానకి షర్మిల ఐపీఎస్ ఆదేశాల మేరకు పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇందులో భాగంగా నంబర్ ప్లేట్లు లేని, మైనబర్ బాలురు డ్రైవింగ్ చేసిన రెండు మోటార్ సైకిళ్లు, రెండు ట్రాక్టర్లు పోలీస్ స్టేషన్‌కి తరలించి సీజ్ చేశారు. మైనర్ బాలుర తల్లిదండ్రులను పిలిపించి రోడ్డు ప్రమాదాల నివారణ కోసం తగిన జాగ్రత్తలు పాటించాలని, మైనర్ బాలుడికి వాహనాలు ఇస్తే కేసు కూడా నమోదు చేయడం జరుగుతుందని కౌన్సిలింగ్ ఇచ్చారు.


దిలావర్‌పూర్‌లో మైనర్లను అదుపులో తీసుకున్న పోలీసులు

జాగృతం కాకుంటే జాతి మనుగడకు ముప్పు

● వీహెచ్‌పీ ప్రాంత మాతృశక్తి సంయోజక్ పద్మశ్రీ

భైంసా, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మతతత్వ శక్తుల దుశ్చర్యలపై జాగృతం కాకుంటే హిందూ జాతి మనుగడకు ముప్పు తప్పదని విశ్వహిందూ పరిషత్ ప్రాంత మాతృశక్తి సంయోజక్ పద్మశ్రీ పేర్కొన్నారు. ఆదివారం భైంసాలోని సుభద్ర వాటికి శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో జరిగిన వీహెచ్‌పీ జిల్లా అభ్యాసవర్గ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మతతత్వ శక్తులు ఆగడాలు, ఆకృత్యాలు అధికమవుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. లవ్ జిహాద్‌లు, మతమార్పిడీలు పెరుగుతున్నాయన్నారు. ఇలాంటి వాటినన్నింటిని నియంత్రించేందుకు గాను హిందువులంతా కుల, ప్రాంత బేధాలు విడనాడి ఐక్యతతో ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వీడిపోతే పడిపోతామనే విషయాన్ని ప్రతీ హిందువు గుర్తించాలన్నారు. జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో చోటుచేసుకున్న మారణ కాండతోనైనా జాతిమేల్కొని చైతన్యమవ్వాలన్నారు. ఇందులో విభాగ్ కార్యదర్శి తమ్మల కృష్ణ, ప్రాంత మాతృశక్తి సహ సంయోజక్ శ్రీవాణి, జిల్లా అధ్యక్షులు జాదవ్ విఠల్, జిల్లా ఉపాధ్యక్షులు గుజ్జులవార్ వెంకటేష్, కార్యదర్శి మూర్తిప్రభు, జిల్లా సహకార్యదర్శి పెరుగు నవీన్, మాతృశక్తి నగర్ సంయోజక్ సుప్రియతోపాటు అధిక సంఖ్యలో వీహెచ్‌పీశ్రేణులున్నాయి.

గోదారమ్మకు లక్ష దీపోత్సవం

బాసర, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): బాసర వద్ద గోదావరీతీరం ఆదివారం లక్ష దీపోత్సవంతో శోభాయమానంగా దర్శనమిచ్చింది. మహారాష్ట్ర పర్భాని పట్టణానికి చెందిన పండిత్ మహారాజ్ డాకే గురుజీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మహారాష్ట్ర భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.మొదట గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి దీపోత్సవంలో దీపాలను వెలిగించారు. నదీతీరంలో గల శివాలయం పరిసరాలు, స్నానఘట్టాలు లక్ష దీపాల వెలుగుల్లో దేదీప్యమానంగా వెలిగిపోయాయి.

ఉగ్రదాడి ఘటనను నిరసిస్తూ గ్రామగ్రామానా నిరసన ప్రదర్శనలు

భైంసా, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్ రాష్ట్రంలోని పహల్గామ్ ప్రాంతంలో జరిగిన ఉగ్రదాడి ఘటనను వ్యతిరేకిస్తూ ఆదివారం భైంసా మండల పరిధిలోని పలు గ్రామాలలో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఉగ్రవాదుల దుశ్చర్యలను ఖండిస్తూ ప్రదర్శనలు కొనసాగాయి. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నిరసనకారులు చేపట్టిన నినాదాలు హోరెత్తాయి. కేంద్రప్రభుత్వం నరమేధానికి పాల్పడ్డ ఉగ్రవాదులకు తగురీతిలో గుణపాఠం నేర్పాలంటూ నిరసనకారులు డిమాండ్ చేశారు. మృతులకు నివాళులు అర్పిస్తూ కొవ్వొత్తులతో వాడవాడలా ప్రదర్శనలు చేపట్టారు. పలు కాలనీలవాసులు క్షతగాత్రులు త్వరితగతిన కోలుకోవాలంటూ ఆలయాల్లో పూజలు నిర్వహించారు. మృతులకుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ సందేశాలు పంపారు. వాలేగామ్ గ్రామంలో జరిగిన కొవ్వొత్తుల ర్యాలీలో బీజేవైఎం డివిజన్ ప్రతినిధి గంగా ప్రసాద్ మాట్లాడుతూ ఉగ్రదాడికి ప్రేరేతిమైన పాకిస్థాన్ మరిచిపోలేని రీతిలో మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం గుణపాఠం నేర్పాలని విజ్ఞప్తి చేశారు.


వాలేగామ్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రజతోత్సవ సభకు తరలిన గులాబీ దండు

భైంసా, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభకు ముథోల్ నియోజకవర్గ పరిధి నుంచి గులాబీ దండు భారీగా తరలి వెళ్లింది. ఆదివారం ఉదయం వేళలో నియోజకవర్గ పరిధిలోని ప్రతీ గ్రామంలో ఆయాగ్రామాల పార్టీప్రతినిధులు బీఆర్ఎస్ జెండాలను ఎగురవేసి వాహనాలలో ర్యాలీగా వరంగల్ సభకు తరలివెళ్లారు. ఇక్కడి ప్రాంతంలోని అన్ని ప్రాంతాల రోడ్లు వరంగల్ సభకు వెళ్లే బీఆర్ఎస్ వాహనాల రద్దీతో సందడిగా కనిపించాయి. భారీసంఖ్యలో వాహనాలు ర్యాలీగా తరలి వెళ్లడంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడ్డాయి. పార్టీ నియోజక వర్గ సమన్వయ కమిటీ ప్రతినిధులు విలాస్ గాదేవార్, లోలం శ్యామ్ సుందర్, డా.పి.రమాదేవి, డా.కిరణ్ కోమ్రేవార్ పక్షం రోజులుగా ప్రణాళికాబద్ధంగా రజతోత్సవ సభకు భారీగా జన సమీకరణకు పకడ్బందీ చర్యలు చేపట్టారు. క్లస్టర్లు, మండలాల వారీగా సన్నాహక సదస్సులు నిర్వహించి పార్టీ శ్రేణులను రజతోత్సవ సభకు సమాయత్తం చేశారు. పార్టీ అధిష్టానం నియోజక వర్గానికి 3వేల మందిని తరలించుక రావాలని టార్గెట్ విధించగా అంతకు మించిన సంఖ్యలో పార్టీ శ్రేణులతో పాటు జనాలు వరంగల్ సభకు తరలివెళ్లారు. దీంతో నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీలో నూతనోత్సవం వెల్లివిరిసింది.

ముథోల్: బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభకు మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేకవాహనాల్లో ఆదివారం వరంగల్‌కు బయలుదేరారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి మూడు బస్సులు, సుమారు 16 వాహనాలలో తరలివెళ్లారు. మొదట పలు గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం సభకు బయలుదేరారు.

సారంగాపూర్: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలలో ఆదివారం బీఆర్ఎస్ నాయకులు గ్రామాలలో బీఆర్ఎస్ పార్టీ జెండాలను ఎగురవేశారు. టపాసులు కాల్చి వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఆధ్వర్యంలో జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభ కార్యక్రమానికి అధిక సంఖ్యలో తరలివెళ్లారు.

దిలావర్‌పూర్: బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులు భారీగా తరలివెళ్లారు. మండల బీఆర్ఎస్ కన్వీనర్ ఎలాల చిన్నారెడ్డి నేతృత్వంలో గులాబీ శ్రేణులు ఆర్టీసీ బస్సుల్లో, ఇతర ప్రైవేట్ వాహనాల్లో బయలు దేరారు. అంతకు ముందు ఆయా గ్రామాల్లో గులాబీ జెండాను ఎగురవేశారు. తెలంగాణ ఉద్యమ నేత కేసీఆర్ ఇచ్చే పిలుపే తమకు శిరోధార్యమని, పార్టీకి తిరిగి పూర్వ వైభవం తెచ్చేందుకు రజతోత్సవ బహిరంగసభ ఉపయోగపడుతుందని భావిస్తున్నట్లు మండల కన్వీనర్ చిన్నారెడ్డి అన్నారు. కార్యకర్తలంతా కలిసికట్టుగా సంఘటితంగా ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

కుంటాల: వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు కుంటాల మండల నుంచుట నాయకులు అధికసంఖ్యలో తరలివెళ్లారు. మండలంలోని అన్నిగ్రామాల నుంచుట 20కి పైగా వాహనాల్లో 400 మందికి పైగా కార్యకర్తలు బీఆర్ఎస్ సభకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండలంలోని కల్లూర్ గ్రామంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ పడకంటి దత్తు, సోషల్ మీడియా అధ్యక్షులు పెంట దశరథ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గతంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేకూరిందని, ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని అన్నారు. మరోమారు బీఆర్ఎస్‌ను అధికారంలోకి తెచ్చేందుకు ప్రజలు సిద్ధమయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.


బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగురవేస్తున్న నాయకులు


జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న పార్టీ ముథోల్ సమన్వయ కమిటీ ప్రతినిధి డా. కిరణ్ కోమ్రేవార్

లోకేశ్వరం: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు ఆదివారం వరంగల్ బహిరంగ సభకు బయలుదేరి వెళ్లారు. లోకేశ్వరం మండల బీఆర్ఎస్ కన్వీనర్ కరిపే శ్యాంసుందర్ బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందరభంగా ఆయన మాట్లాడారు. మళ్లీ రాష్ట్రంలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

తానూర్ : మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం మాజీ సర్పంచ్ సురేష్ యాదవ్ ఆధ్వర్యంలో వరంగల్‌కు తరలివెళ్లారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో వరంగల్‌లోని ఎల్కతుర్తిలో నిర్వహించనున్న రజతోత్సవ సభకు బయలు దేరారు.

బాసర: మండలంలో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు .ఆ పార్టీ మండల అధ్యక్షులు కోర్వ శ్యామ్ ఆధ్వర్యంలో మండల పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వరంగల్‌లో జరిగే రజతోత్సవ మహాసభకు మండలంలో పదిగ్రామాల నుంచి 30 వాహనాల్లో కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ నూకం రామరావు, మాజీ ఉపసర్పంచ్ లాల్ మియ్యా, ఆ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

● రెండు దశాబ్దాల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్న విద్యార్థులు



ముథోల్ జిల్లా పరిషత్ పూర్వ విద్యార్థులు, గురువులు

ముథోల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో మరపురాని జ్ఞాపకాలను నెమరు వేసుకునే ఆతీమయ సమ్మేళనం ఎన్నటికీ మరువలేనిదని పలువురు పూర్వ విద్యార్థులు అన్నారు. మండల కేంద్రమైన ముథోల్‌లోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002-03 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సుమారు 20 ఏళ్ల క్రితం చదువు తున్న పూర్వ విద్యార్థులంతా ఒకేచోట చేరి ఆత్మీయ పలకరింపులతో యోగ క్షేమాలు తెలుసుకుంటూ ఆనందంగా గడిపారు. ఉదయంనుంచి సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేద్దామంటూ తోటి వి ద్యార్థులకు ఉపయోగపడతామంటూ తీర్మానాలు చేసుకున్నారు. విద్యా బుద్ధులు నేర్పిన గురువులను ఆప్యాయంగా పలకరించి, సన్మానించారు. తమ విద్య వైవా హిక, ఉద్యోగ, జీవిత విశేషాలు, కుటుంబ నేపథ్యాల గురించి ఒకరికొకరు చెప్పు కుంటూ సెల్ఫీలు, ఫోటోలు తీసుకుంటూ ఎంతో ఆనందోత్సాహలతో గడిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళి గౌడ్, సుదర్శన్, సాయినాథ్, గంగారాం, దేవగౌడ్, విశ్వనాథ్, మల్లారెడ్డి, రమేష్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

శిశు మందిర్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నిర్మల్ కల్చరల్: నిర్మల్ పట్టణం బ్రహ్మపురి శిశు మందిర్ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. 31 ఏళ్ల తరువాత కలుసుకుని పాత జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్య నేర్పిన గురువులను శాలువాతో సన్మానించారు.

ఈదురు గాలులకు
తెగిపడిన విద్యుత్ స్తంభాలు



తెగిపోయిన స్ట్రీట్ లైట్ విద్యుత్ వైర్లు

నర్సాపూర్(జి), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుప్లి గ్రామంలో శనివారం రాత్రి ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు, తీగలు తెగిపోయాయి. ఆదివారం విద్యుత్ శాఖ అధికారులు వైర్ల కింద ఉన్న చెట్ల కొమ్మలను విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా కొమ్మలను కత్తిరించారు. ఈ కార్య క్రమంలో లైన్‌మెన్, జేఎల్ఎం పాల్గొన్నారు.

తిమ్మాపూర్ గ్రామంలో బ్రిడ్జి వద్ద
రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం



బ్రిడ్జి వద్ద రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభం

నర్సాపూర్(జి), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో కెనాల్‌పై నుంచి బ్రిడ్జి వేసి రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించి రోడ్డు వేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. లేదంటే తిమ్మాపూర్ మీది నుండి అంజనీ మండల కేంద్రానికి వేసి రోడ్డు ఇరుకుగా అవుతుందని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు కోరుతున్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ అట్ల అమ్మాయి మాట్లాడుతూ... సదరు కాంట్రాక్టర్ తన సొంత నిధులతో స్తంభాన్ని తొలగిస్తానని చెప్పి ఇప్పుడు మాట మారుస్తున్నారన్నారు. అధికారులు స్పందించి తిమ్మాపూర్ గ్రామం నుంచి మండల కేంద్రానికి వెళ్లే రోడ్డుకు అడ్డంగా ఉన్న స్తంభాన్ని తొలగించాలని వేడుకున్నారు.

తాంసి చెరువులో భారీగా మట్టి తవ్వకాలు



మట్టిని తరలిస్తున్న వాహనాలు

తాంసి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తవ్వుకుపోతున్నారు. నిత్యం లక్షల రూపాయల విలువ చేసే మట్టిని తవ్వుతున్న పట్టించుకునే వారి కరువయ్యారని మండల వాసులు అంటున్నారు. నిత్యం పదుల సంఖ్యలో లారీల్లో ఈ మట్టిని తరలిస్తు న్నారు. ఎలాంటి పర్మిషన్ లేకుండానే మట్టిని తవ్వడం పట్ల పలువురు పలు విధాలుగా చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా రెవిన్యూ శాఖ అధికారులపై మండిపడుతున్నారు. అక్రమ తవ్వకాలను అడ్డుకునే అధికారులే ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉంటే మత్తడి ప్రాజెక్టు నుంచి మొరం తవ్వుతున్నప్పటికీ మైనింగ్ పరిమిషన్ లేదని పలువురు వాపోతున్నారు. అదేవిధంగా ముత్తడివాగు ప్రాజెక్టు సమీపంలో సైతం మట్టిని పక్షం రోజుల నుంచి తవ్వుకుపోతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయంపై తాంసి తహసీల్దార్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.

● జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

తాంసి మండల కేంద్రంలోని తాంసి వాగులో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తవ్వుతున్న విషయంపై స్థానిక రైతులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది. పలుమార్లు అధికారులకు విన్నవించిన ఎలాంటి ఫలితం లేకుండా పోతుందని, నాణ్యమైన మట్టి ఇతర ప్రాంతాలకు తరుగుతుందని పేర్కొన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసు కోవాలని గ్రామ రైతులు కోరుతున్నారు.

● పట్టించుకోని తహసీల్దార్

ఎక్కడైనా అనుమతులు లేకుండా తవ్వకాలు జరిపితే వెంటనే స్పందిం చాల్సిన తహసీల్దార్ పట్టించుకోవడం లేదన్న విమర్శలు తాంసి మండలం లో వ్యక్తం అవుతున్నాయి. అనుమతులు లేకున్నా ఎక్కడ తవ్వకాలు జరుగుతున్నప్పటికీ మామూలుగా తీసుకుంటున్నారు అన్న ఆరోపణ లేకపోలేదు. వాస్తవానికి అను మతులు లేకుండా పనులు చేపడితే కఠిన చర్యలు తీసుకోవలసిన బాధ్యత త హసీల్దారుపై ఉంది. కానీ అలాంటి చర్యలు చేపట్టడం లేదని పలువురు అం టు న్నారు. పేదవాడు ఇంటి నిర్మాణం కోసం ఇసుక ట్రాక్టర్ తరలిస్తేనే పట్టుకుని తహసీల్దార్ నిత్యం లక్షల రూపాయల అక్రమ వ్యాపారం జరుగుతున్న ఎందుకు పట్టించుకోవడం లేదని పలువరపు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌తో పాటు రాష్ట్ర స్థాయి అధికారులకు కూడా ఫిర్యాదు చేయనున్ననట్లు తెలిసింది.

● రిజిస్ట్రేషన్‌లపై నీలి నీడలు

అన్ని పత్రాలు ఉండి రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వారిపై కూడా రెవెన్యూ అధికారులు పెత్తనం చెలాయిస్తున్నారన్న ఆరోపణ లేకపోలేదు. అన్ని ప త్రాలు ఉండి కూడా డబ్బులు చెల్లిస్తేనే తమకు రిజిస్ట్రేషన్ అవుతుందని పలువురు లబ్ధిదారులు పేర్కొంటున్నారు. ఈ విషయంపై కూడా జిల్లా కలెక్టర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది. ఒకవేళ జి ల్లా కలెక్టర్ ఈ విషయంలో స(ం)దించకపోతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దకు కూడా తమ సమస్యను వినిపిస్తామని అంటున్నారు. ఇందులో వా స్తవం ఎంతో తెలియదు గాని మండల వాసులు మాత్రం రెవిన్యూ శాఖ పై తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్టు తెలిసింది.



పార్కులో పనిచేయని వాటర్ ఫౌంటైన్..



ఆదిలాబాద్‌లోని గాంధీ పార్క్



సందర్శకులు రాక వెలవెలబోతున్న గాంధీ పార్క్

అస్తవ్యస్తంగా గాంధీ పార్క్

● పార్క్‌లో ఆహ్లాదం అంతంతే ● కళ తప్పిన పార్కు. కనిపించని పచ్చదనం ● పనిచేయని ఫౌంటైన్‌లు ● సందర్శకులకు అందని ఆహ్లాదం

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆహ్లాదం కోసం సేద తీరేందుకు ఏర్పాటు చేసిన పార్కుల్లో సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ఆనందం కోసం వెళ్తే ఇబ్బందులు తప్పడం లేదు. పిల్లలు, పెద్దలు కాసేపు సేదతీరుదామని వస్తే వారికి ఎన్నెన్నో సమస్యలు కనిపిస్తున్నాయి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రధాన పార్కు అయినా గాంధీ పార్కులో సౌకర్యాలు కరువై క్రమంగా సందర్శకుల తాకిడి తగ్గిపోతున్నది. ప్రతీ వేసవిలో ఎంతో శోభించి పోయే ఈ పార్కులో ఇపుడు పర్యవేక్షణ లేక పట్టించుకునే వారు లేక కళ తప్పిపోయింది. ప్రజలకు ఆహ్లాదం, ఆరోగ్యం పెంచాల్సిన పార్కులు అలంకార ప్రాయాలుగా మారిపోయాయి.

గాంధీ పార్కులో కనిపించని పచ్చదనం

ఆదిలాబాద్ పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే ఉద్దేశంతో ఇరవై సంవత్సరాల క్రితం ఈ గాంధీ పార్కు ను ఏర్పాటు చేశారు. పట్టణ పరిసర గ్రామాల ప్రజ లు కూడా ఈ పార్కుకు వచ్చి సేద తీరుతారు. సాధా రణంగా సెలవు దినాల్లోనే ఈ పార్కులో సందర్శకులతాకిడి ఎక్కువగా ఉంటుంది. అలాంటిది ప్రస్తుతం వేసవి సెలవులు వచ్చాయి. కానీ ఈ పార్కులో పచ్చదనం కరువై. ఆహ్లాదం పంచేందుకు వీలు లేకుండా కనిపిస్తుంది. దీంతో సందర్శకులు గణనీయంగా తగ్గిపోతున్నారు. ఈ పార్కులో చిన్నపిల్లలు ఆడుకునే వస్తువులు సైతం నిరుపయోగంగా మారాయి. అదేవిధంగా పార్కులోని పలు చోట్ల ఫౌంటైన్‌లు పనిచేయక కళా విహీనంగా కనిపిస్తుంది. దీంతో పార్కులోకి రావడానికి జనాలు ఆసక్తి చూపడం లేదు. పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన ఆట పరికరాలు ధ్వంసమై సంవత్సరాలు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. అదేవిధంగా సాయంత్రం చికటి పడేసరికి లైట్లు లేక పలు ఇబ్బందులు పడుతున్నారు.

పార్కులో పనిచేయని ఫౌంటైన్‌లు..

గాంధీ పార్క్‌లో నీటి సమస్య కారణంగా పచ్చ దనం అనేది కనిపించడం లేదు. దీంతో పార్క్ మొత్తం పచ్చదనం లేక ఎండిపోయినా చెట్లతో ఎడారిలా కనిపిస్తుంది. నీటి సమస్య కారణంగా పార్కు మొత్తం నీరందించలేక మొక్కలు, గడ్డి ఎండి పోతున్నాయి. అదే విధంగా ఈ పార్కులో పలు చోట్ల ఫౌంటెన్‌లు పనిచేయడం లేదు. ఆ ఫౌంటైన్ యంత్రాలు చెడిపోయాయి. అయినా కూడా వాటిని మరమ్మతులు చేయకపోవడంతో అవి ఉపయోగంలో లేకుండా పోయాయి. దీంతో పార్కులోకి వచ్చే సందర్శకులు ఫౌంటెన్ లాంటి అందాలు వీక్షించి ఆహ్లాదం పొందలేక పోతు న్నారు.

నిరుపయోగంగా మారిన పరికరాలు

ఈ పార్కులో చిన్న పిల్లల కోసం ఏర్పాటుచేసిన ఆట వస్తువులు ఉయ్యాలలు, రైలు బండి, ఓపెన్ జిమ్ లాంటి పరికరాలు అక్కడ క్కడ చెడి పోయాయి. దీంతో చిన్నారులు ఉప యోగించుకోలేక పోతున్నారు. అదేవిధంగా మినీ రైలు ఎక్కి ఆనందించేందుకు వీలు లేకుండా పోయింది. దీంతో అసలు ఏమి లేని పార్కులకు పిల్లలను తీసుకు వచ్చి ప్రయోజనం లేదని భావించి తల్లిదండ్రు లు పార్కులకు రావడానికి ఇష్టపడటం లేదు. అక్కడక్కడ పలు ఆట వస్తువులు చెడిపోయిన అవి మరమ్మతులకు నోచుకోవడం లేదు.



ఫ్రీడమ్ పార్క్‌లో ఎండిపోయిన మొక్కలు



పార్కులో ఎండిపోయిన గార్డెనింగ్

పార్కులో సౌకర్యాలు కరువు

● గౌలీ సంజీవ్ కుమార్, మాజీ కౌన్సిలర్, ఆదిలాబాద్



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పార్కు మరి అధ్వానంగా తయారైంది. పార్కుకు పిల్లల ను ఎపుడైనా తీసుకురావాలన్న ఆలోచించే పరిస్థితి వచ్చింది. ఈ వేసవిలో పిల్లలు కుటుం బంతో పార్కులో సేద తీరుద్దాం అన్నా పచ్చ దనం లేని చెట్లు నీడనివ్వలేక పోతున్నాయి. ఇక పిల్లలకు సంబంధించిన రైలు ఇతర ఆట వస్తువులు నిరుపయోగంగా ఉన్నాయి. ఇపుడు నిర్వాహకులు, అధికారులు పట్టించుకోకపోతే ఈ పార్కుకు ఎవరు వచ్చే పరిస్థితి ఉండదు.

సౌకర్యాలు మెరుగు పరుస్తాం

● ప్రశాంత్, గాంధీ పార్క్ నిర్వాహకులు, ఆదిలాబాద్



మేము ఇటీవలే టెండర్ తీసుకున్నాం.. పార్కులో పూర్తిగా పరిశీలన చేసి అవసరమైన వి మరమ్మతులు చేయిస్తాం.. సౌకర్యాల కోసం సంబంధిత శాఖ అధికారులకు విన్నవిస్తాం.. సమర్ధవంతంగా పనిచేసి రానున్న రోజుల్లో పార్కును పచ్చదనంతో సందర్శకులకు ఆహ్లాదం అందించేందుకు కృషి చేస్తాం..

పార్కులో మరమ్మతులు చేసి అభివృద్ధి చేస్తాం

● వెంకటేశ్వర్లు, డీవైఎస్‌వో ఆదిలాబాద్



పార్కులో పలు సమస్యలు ఉన్న విషయం వాస్తవమే.. ప్రధా నంగా నీటి సమస్య కారణంగా మొక్కలకు నిరందించ లేక పచ్చ దనం లేకుండా పోయింది.. మున్సిపల్ శాఖ సహకారంతో సమస్యలను పరిష్కరిస్తున్నాం.. అదేవిదంగా నీటి సమస్య, పనిచేయని ఫౌంటైన్‌లు ఇతర పరికరాలు మరమ్మతు చేస్తాం.. పార్కును అబివృద్ధి చేస్తాం.



బతుకమ్మలతో పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ మంత్రి, పార్టీ శ్రేణులు, మహిళలు



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న



జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

కమీషన్ల కోసమే కాంగ్రెస్ అప్పులు చేస్తుంది

● మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ● పార్టీ రజతోత్సవ సభకు తరలివెళ్లిన మాజీ మంత్రి, పార్టీ శ్రేణులు

ఆదిలాబాద్‌అర్బన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్, బీజేపీలు మోస పూరిత మాటలతో అధికారంలోకి వచ్చి ప్రజలను తీవ్ర సంక్షోభాన్ని గురి చేస్తున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ధ్వజమెత్తారు. ఆదివారం వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహిస్తున్న పార్టీ రజతోత్సవ సభకు భారీగా తరలి వెళ్లారు. జోగురామన్న ఆధ్వర్యంలో స్థానిక గాయత్రి గార్డెన్ నుంచి వందల సంఖ్యల వాహనాలతో పార్టీ శ్రేణులు వరంగల్ సభకు బయలుదేరగా ఆయన జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. మహిళలు మంగళహారతులు, బతుకమ్మతో స్వాగతం పలికారు. అనంతరం బతుకమ్మను జోగురామన్న తలపై ఎత్తుకొని పట్టణంలోని పుర వీధుల గుండా ర్యాలీ కొనసాగించారు. జై తెలంగాణ.. జై కేసీఆర్ అంటు పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ పార్టీ జెండాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగురామన్న మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతాంగ సంక్షేమం కోసం పెట్టుబడులు తీసుకొస్తే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం వారి కమిషన్ల కోసం బాకీలు చేయడం జరుగుతుందన్నారు. వరంగల్‌లో నిర్వమించే రజతోత్సవ సభలో కేసీఆర్ మాటలు కాంగ్రెస్,బీజేపీ ప్రభుత్వాల పై తీవ్ర ప్రభావాన్ని చూపనున్నాయని పేర్కొన్నారు. సభకు 5000 మందితో పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి జాగ్రత్తలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ జోగుప్రేమేందర్, పట్టణ అధ్యక్షులు అలాల్‌అజయ్, ఇజ్జగిరి నారాయణ, మెట్టు ప్రహ్లాద్, లింగారెడ్డి, మార్శెట్టి గోవర్ధన్, యాసం నర్సింగరావు, యూనిస్ అక్బాని, సాజిదొద్దిన్, అశ్రఫ్, రాజన్న, జగదీప్, దాసరి రమేష్, కస్తాల ప్రేమల, స్వరూపరాణి పాల్గొన్నారు.

భారీ కాన్వాయ్‌తో బయలుదేరినర బోథ్ ఎమ్మెల్యే

నేరడిగొండ: వరంగల్ పట్టణంలోని ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు బోథ్ నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భారీ కాన్వాయ్ లతో బయలుదేరారు. మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ నాయకత్వంలోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయన్నారు. ప్రజలు మళ్ళీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. అంతకు ముందు నేరడిగొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ 25వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పార్టీ నాయకులతో కలిసి జెండాను ఆవిష్కరించారు. నాయకులు, కార్యకర్తలు జై తెలంగాణ నినాదాలతో హోరెత్తించారు. అనంతరం వరంగల్ రజతోత్సవ కార్యక్రమానికి బయలుదేరనున్న ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించారు. దారి పొడవునా బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నింపుతూ వారితో కలిసి నృత్యం చేసిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ ఇంటి పార్టీ పండుగ సందర్భంగా వరంగల్‌లో నిర్వహించిన రజతోత్సవ సభకు వెళ్తూ ఊరూరా గ్రామాల్లో భారీ కాన్వాయ్ నిలుపుతూ డీజే వద్ద బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి నృత్యాలు చేస్తూ వారిలో జోష్ నింపుతూ సభకు వెళ్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ జగిత్యాలలో శ్రీ నరసింహ టీ టిఫిన్స్ హోటల్ వద్ద బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి పాదయాత్రగా వెళ్తూ నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలను ఆకట్టుకున్నారు. ఎమ్మెల్యే వారితో కలిసి కార్యకర్తగా కలిసి పోయి సభకు వెళ్లడాన్ని చూసి కార్యకర్తలు ఉత్సాహపడ్డారు.

గులాబీమయమైన ఖానాపూర్

ఖానాపూర్: ఖానాపూర్ నియోజకవర్గంలో ఆదివారం గులాబీ జెండా ఊరువాడ రెపరెపలాడింది. పార్టీ ఆవిర్భవించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నియోజకవర్గ కేంద్రంతో పాటు ప్రతి పల్లె పల్లెలో బీఆర్ఎస్ శ్రేణులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనం తరం వరంగల్‌లోని ఎల్కతుర్తిలో నిర్వహిస్తున్న సభకు తరలివెళ్లారు. వరంగల్ సభకు తరలి వెళ్లే క్రమంలో నియోజకవర్గ కేంద్రమైన ఖానాపూర్‌లోని జాన్సన్ నాయక్ క్యాంపు కార్యాలయం వద్దకు పలు గ్రామాల బీఆర్ఎస్ శ్రేణులు చేరుకు న్నారు. తమ క్యాంపు కార్యాలయానికి వచ్చిన పార్టీ శ్రేణుల కోసం జాన్స న్ కార్యాలయ ఆవరణలో భోజనాలు ఏర్పాటు చేశారు. ఉదయం 11:30 గంటలకు ఖానాపూర్‌లోని విద్యానగర్ నుండి తెలంగాణ తల్లి చౌరస్తా వరకు జాన్సన్ నాయక్ తన అనుచరులు పార్టీ కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ తల్లి చౌరస్తాలో జాన్సన్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి ఎల్కతుర్తి సభకు బయలుదేరారు. ఈ సందర్భంగా జాన్సన్ భారీ కాన్వాయ్‌తో బయలుదేరడంతో సుమారు రెండు కిలో మీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయ్యింది. జాన్సన్ కాన్వాయ్ మండలంలోని బాధనకుర్తికి చేరుకోగానే పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా టపాసులు పేల్చి సంబరాలు నిర్వహించారు. అనంతరం భారీ కాన్వా య్‌తో జాన్సన్ నేతృత్వంలో బీఆర్ఎస్ శ్రేణులు వరంగల్ ఎల్కతుర్తి సభకు బయలుదేరి వెళ్లారు. అంతకుముందు తన ఇంటి వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో జాన్సన్ మాట్లాడుతూ నియోజక వర్గం నుంచి 40 బస్సులు, 270 ఇతర వాహనాలలో 4500 మంది వర కు పార్టీ శ్రేణులు వరంగల్ సభకు తరలివెళ్తున్నట్లు పేర్కొన్నారు. రజ తోత్సవ సభ క్షేత్ర స్థాయిలో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని జాన్సన్ తెలిపారు. కాగా అర్ధరాత్రి 12 గంటల నుండి ఖానాపూర్‌లో బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా ప్రారంభించారు. స్థానిక తెలంగాణ తల్లి చౌరస్తాలో శనివారం అర్ధరాత్రి కార్య కర్తలంతా గుమిగూడారు. సమయం అర్ధరాత్రి 12 గంటలు దాటగానే పెద్దఎత్తున టపాసులు పేల్చి సంబరాలను జరిపారు.



ఖానాపూర్‌లో బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ సంబరాలను ప్రారంభిస్తున్న పార్టీ శ్రేణులు



డీజేతో నృత్యాలు చేస్తూ వెళుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్



తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నినాదాలు చేస్తున్న జాన్సన్ నాయక్





• నిర్మల్ నుంచి ఖానాపూర్ వెళ్తున్న 61వ జాతీయ రహదారి ఇదే..



• నాలుగు రాష్ట్రాలకు లింకేజీ
• ఐదు జిల్లాలకు రోడ్డు మార్గం
• పూర్తి కావస్తున్న రెండు హైవేల నిర్మాణ పనులు
• మెరుగు పడుతున్న రోడ్డు రవాణా రంగం
• విస్తరించనున్న వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు

నిర్మల్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న ఎన్‌హెచ్ నెంబర్ 44

హైవేల అడ్డాగా నిర్మల్

నిర్మల్, ఏప్రిల్27 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా కేంద్రం నాలుగు హైవేలకు నిలయంగా మారుతోంది. ఈ హైవేలు నాలుగు రాష్ట్రాలకు లింకేజీగా మారుతున్నాయి. అలాగే నిర్మల్‌తో పాటు మరో ఐదు జిల్లాలకు కూడా ఈ రోడ్లు అనుసంధానం కానున్నాయి. ఇప్పటికే హైదరాబాద్ నుండి నాగపూర్ వరకు నేషనల్ హైవే నెంబర్ 44 కొనసాగుతుండగా కొంతకాలం క్రితమే మహారాష్ట్రలోని కళ్యాణ్ నుండి భైంసా మీదుగా నిర్మల్ వరకు నేషనల్ హైవే నెంబర్ 61 రోడ్డు ప్రారంభమైంది. ఈ రెండు హైవేలతో మహారాష్ట్రకు లింకేజీ కొనసాగుతోంది. ప్రస్తుతం ఈ రెండు హైవేలు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా పరిధిలో ఉన్నాయి. కాగా ఈ హైవేకు మరో హైవేను లింకేజీ చేస్తూ నేషనల్ హైవే శాఖ (ఆర్ అండ్ బీ) నిర్మల్ నుంచి ఖానాపూర్ మీదుగా జగిత్యాల వరకు జాతీయ రహదారిని నిర్మిస్తోంది. ప్రస్తుతం నిర్మల్ నుంచి ఖానాపూర్ వరకు రోడ్డు పనులు పూర్తయ్యాయి. దాదాపు రూ. 140కోట్లతో ఈ రోడ్డు పనులను చేపట్టారు. కాగా ఈ రోడ్డు కవ్వాల్ అభయారణ్యం పరిధిలో ఉన్నందున ఇక్కడి వన్యప్రాణుల సంరక్షణ కోసం రూ.40కోట్ల వ్యయంతో ఏడు చోట్ల అండర్ పాసుల నిర్మాణ పనులు ముగింపు దశలో ఉన్నాయి. దీంతో పాటు బోధన్ నుంచి బాసర మీదుగా భైంసా వరకు నేషనల్ హైవే నెంబర్ 161 పరిధిలో బీటీ హైవే రోడ్డు పేరిట రహదారి పనులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం 70శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. మొత్తం రూ.388 కోట్లతో ఈ రోడ్డు పనులను చేపట్టారు. నిర్మల్ జిల్లాలో 30 కిలోమీటర్లు నిజామాబాద్ జిల్లాలో 26.4 కిలోమీటర్ల పొడవుతో ఈ రోడ్డు నిర్మాణం కొనసాగుతోంది. రోడ్డు నిర్మాణ పరిధిలోనే బాసర గోదావరిపై దాదాపు 40కోట్ల రూపాయల వ్యయంతో మరోకొత్త బ్రిడ్జిని కూడా నిర్మిస్తున్నారు.



విస్తరించనున్న వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు

నాలుగు హైవేలు నాలుగు రాష్ట్రాలను కనెక్టివిటీ చేయనున్న కారణంగా ఈ హైవేల పరిధిలో ఉన్న అన్ని జిల్లా లలో వ్యాపార, వాణిజ్య రంగాలు మరింత విస్తరించే అవకాశాలు ఉన్నాయంటున్నారు. నిర్మల్ జిల్లాతోపాటు ఆదిలాబాద్, మంచిర్యాల, జగిత్యాల, నిజామాబాద్, కా మారెడ్డి జిల్లాలకు మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలతో వ్యాపార కార్యకలాపాలు విస్తరించే అవకాశం ఉంటుందంటున్నారు.
ఇప్పటికే కళ్యాణ్ టు నిర్మల్ హైవే కారణంగా నిర్మల్, నిజామాబాద్ జిల్లాలకు చెందిన వ్యాపారులు నాందేడ్‌తో పాటు జాల్నా, పర్బనీ, ఔరంగాబాద్, ముంబాయి లాంటి నగరాలకు వరకూ వెళ్లి వ్యాపార లాబాదేవీలు కొనసాగిస్తున్నారు. అలాగే హైదరాబాద్ నుండి నాగపూర్ వరకు గల నేషనల్ హైవే నెంబర్ 44తో కూడా వ్యాపార వాణిజ్య కార్యకలాపాలు విస్తరించాయి. మరో రెండు హైవేల పనులు కొద్ది రోజుల్లోనే పూర్తి కానునందున రాబోయే రోజుల్లో అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి జరిగేందుకు మార్గం ఏర్పడుతుందంటున్నారు.

నాలుగు రాష్ట్రాలకు లింకేజీ

నిర్మల్ జిల్లా మీదుగా ఇప్పటికే నేషనల్ హైవే నెంబర్ 44 కొనసాగుతోంది. దీంతో నిర్మల్‌తోపాటు నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్ జిల్లాలకు మహారాష్ట్రతో లింకేజీ ఏర్పడింది. అలాగే నేషనల్ హైవే నెంబర్ 61లో భాగంగా మహారాష్ట్రలోని కళ్యాణ్ నుంచి నిర్మల్ వరకు రోడ్డు ఏర్పడడంతో మహారాష్ట్రలోని మరో భాగానికి నిజామాబాద్, నిర్మల్ జిల్లాలు అనుసంధానమయ్యాయి. అలాగే నిర్మల్ నుండి ఖానాపూర్ మీదుగా జగిత్యాల వరకు నిర్మిస్తున్న నేషనల్ హైవే కారణంగా నిర్మల్ జిల్లాకు లింకేజీ ఏర్పడబోతోంది. నిజామాబాద్‌నుండి చత్తీస్‌ఘడ్‌లోని జగదల్‌పూర్ వరకు నేషనల్ హైవే నెంబర్ 63 రహదారి ఉన్నందున ఈ రోడ్డుకు నిర్మల్, జగిత్యాల హైవే లింకేజీ కాబోతోంది. అలాగే బోధన్ నుంచి బాసర మీదుగా భైంసా వరకు నిర్మిస్తున్న 161 బీబీ హైవే రోడ్డుతో కర్ణాటక రాష్ట్రానికి లింకేజీ ఏర్పడనుంది. ఈ నేషనల్ హైవే హైదరాబాద్ నుంచి మద్నూరు వెళ్లే రోడ్డుకు కనెక్ట్ కానున్నట్లు అధికారులు చెబుతున్నారు. కాగా ఆంధ్రప్రదేశ్‌కు కూడా ఈ హైవే కారణంగా కనెక్టివిటీ ఉంటుందని ఆఫీసర్లు పేర్కొంటున్నారు. మొత్తానికి ఈనాలుగు హైవేలతో నాలుగురాష్ట్రాలకు కనెక్టివిటీ ఏర్పడనుంది.



హాల్‌టికెట్ నెంబర్ చూసుకుంటున్న విద్యార్థులు

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

కుంటాల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కుంటాల స్థానిక ఆదర్శమోడల్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 6వ తరగతి నుంచి 10వ తరగతి వర కు పాఠశాలలో ఉన్న ఖాళీల భర్తీ కొరకు నిర్వహించిన ఈ పరీక్షల్లో 6వ తరగతిలో 374 ఖాళీలకు గానూ 275మంది పరీక్షలు రాయగా 99మంది గైర్హాజరయ్యారు. 7వ తరగతిలో 78 ఖాళీలకు గాను 45 మంది పరీక్షలు రాయగా 33మంది గైర్హాజరయ్యారు. 8వ తరగతిలో 63 మందికి గానూ 45 మంది పరీక్షలు రాయగా 18 మంది గైర్హాజర య్యారు. 9వ తరగతిలో 61 గానూ 37 మంది పరీక్షలు రాయగా 24 మంది గైర్హాజరయ్యారు. 10వ తరగతిలో 14 మందికి గానూ 9మంది పరీక్షలు రాయగా ఐదుగురు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్ తెలిపారు.

రేపు జిల్లా కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ సమావేశం

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్27 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా కేంద్రం మంజులాపూర్ మారుతి ఇన్ హోటల్‌లో మంగళవారం ఉదయం 11 గంటలకు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎగ్జిక్యూటివ్ సమావేశం నిర్వహిస్తున్నట్టు డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. పీసీసీ పరిశీలకుడు చంద్రశేఖర్ గౌడ్, అవేజ్ హాజరవుతున్నట్టు తెలిపారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ ఎంపీలు, అన్ని స్థాయి శాఖలకు చెందిన చైర్మన్లు, మాజీలు, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు, మాజీలు, ఇతర శ్రేణులు హాజరుకావాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా

భైంసా, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి జరుగాల్సిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను కాకతీయ విశ్వవిద్యాలయం మరోసారి అర్ధాంతరంగా వాయిదా వేసింది. విశ్వవిద్యాలయం పరిధిలోని వేలాది మంది విద్యార్థుల చదువులపై పరీక్షల వాయిదా ప్రభావం చూపనుంది. జిల్లాలో 3 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలతోపాటు 23 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు కలిపిమొత్తం 26డిగ్రీ కళాశాలలున్నాయి. రాష్ట్రప్రభుత్వం బోధన రుసుములు విడుదల చేయడం లేదని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు పరీక్ష ఫీజులు చెల్లించడానికి ముందుకు రాలేదు. దీంతో విశ్వవిద్యాలయం అధికారులు ఈనెల 21 నుంచి జరుగాల్సిన సెమిస్టర్ పరీక్షలను 28కి వాయిదా వేసారు. అయితే కాకతీయ యూనివర్సిటీ పరిధిలో మొత్తం 296 డిగ్రీ కళాశాలలు ఉండగా ఇందులో 156 కళాశాలలు మాత్రమే పరీక్ష ఫీజులు చెల్లించాయి. శనివారం వరకు మిగతా కళాశాలలు పరీక్ష ఫీజులు చెల్లించకపోవడంతో విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారిఆచార్య రాజేందర్ మరోమారు డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేస్తున్నట్లుగా ప్రకటించారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

సారంగాపూర్, ఏప్రిల్27 (ఆంధ్రజ్యోతి): బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎంఈవో మధుసూదన్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో గల వీధుల్లో బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలను చేర్పించేలా బడిఈడు పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రయివేటు పాఠశాలల కన్న ప్రభుత్వ పాఠశాలలోనే విద్యను అభ్యసించడం వల్ల కలిగేలాభాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులున్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం కార్యవర్గం ఎన్నిక

లక్ష్మణచాంద, ఏప్రిల్27 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో విశ్వబ్రాహ్మణ సంఘంకార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా బిక్కునూరి రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం వైస్‌ప్రెసిడెంట్‌గా ఎస్.చంద్రశేఖర్, క్యాషియర్‌గా ఏలేశ్వరం నరేష్, కార్యదర్శిగా ఏలేశ్వరం గంగాధర్, సంయుక్త కార్యదర్శులుగా పగడపల్లి రాజేందర్, ఏలేశ్వరం భూమేశ్వర్, బిక్కునూరి నారాయణ, నాగభూషణ్, సుదర్శన్, అవినాష్, సాయి, రాజులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నిర్మల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ ఓస రాజేశ్వర్, మాజీ కోఆప్షన్ సయ్యద్ సిరాజుద్దీన్, నాయకులు తదితరులున్నారు.

రైతులు సేంద్రియ ఎరువులనే వాడాలి

• జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్

సోన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రైతులు యూరియా వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువులనే వాడాలని జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ అన్నారు. మండలంలోని మాదాపూర్ రైతువేదికలో విశ్వఆగ్రోటెక్ ఆధ్వర్యంలో సేంద్రియ ఎరువుల వినియోగంపై అవగాహన, రసాయిన ఎరువుల వల్ల పర్యావరణ కాలుష్యం, నేల కాలుష్యం, నత్రజని, భాస్వరం, పోటాష్‌తోపాటు మొక్కలకు కావాల్సిన 16రకాల స్థూల మూల పోషకాల ఆవశ్యకతపై సంస్థ ఎండీ సుభాష్, బీవీ రాజు ఆదివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ యూరియా వాడకం తగ్గించాలని, గతేడాది జిల్లాలో 38 వేల మెట్రిక్‌టన్నుల యూరియా వినియోగం జరిగితే ఈ ఏడాది 42వేల మెట్రిక్ టన్నులకు పెరిగిందన్నారు. వినియోగం పెరిగినా దిగుబడిలో ఎలాంటి తేడా లేదని అన్నారు. అనవసరపు రసాయన ఎరువులు వినియోగించ తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలన్నారు. భూసార పరీక్షలు చేసుకోవాలన్నారు. పరీక్షలో వచ్చిన ఫలితాన్ని బట్టే ఎరువులను వేసి పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవాలన్నారు. అనంతరం ఇటీవల ఉగ్రదాడిలో అసువులు బాసిన కుటుంబాలకు అశ్రు నివాళులర్పిస్తూ 2నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో సంస్థ మేనేజర్ కృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారి అశోక్, రైతులు పాల్గొన్నారు.

ఎండ నుంచి కాస్త ఉపశమనం

• ఆదివారం జిల్లాలో 37డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
• గాలివానలతో వాతావరణంలో మార్పులు

ఖానాపూర్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భారీగా ఉష్ణోగ్రతలు నమోదవడంతో ఉక్కిరిబిక్కిరైన జిల్లావాసులకు ఎట్టకేలకు కాస్త ఉపశమనం లభించింది. శనివారం రాత్రి పలుచోట్ల ఈదురు గాలులతో కూడిన చిరుజల్లులు కురిశాయి. దీంతో ఆదివారం తెల్లవారు జాము నుండే వాతావరణంలో మార్పు కనిపించింది. ఆకాశం మేఘావృతమై ఉండడంతో వాతావరణం చల్లబడింది. గత వారం రోజుల వ్యవధిలో వరుసగా మూడు రోజులు జిల్లాలో 45 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రతలు నమోదైన నేపథ్యంలో ఆదివారం 37 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడం ప్రజలకు ఉపశమనం కలిగించింది. ఇక రాత్రివేళ ఈదురు గాలులతో చిరుజల్లులు కురవడంతో కల్లాల్లో ధాన్యం ఆరబెట్టిన రైతులు ఆందోళన చెందారు. మారిన వాతావరణంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. వరి పంట చేతికందిన దశలో వస్తున్న ఈ వాతావరణంలో మార్పు ఏ పరిస్థితికి దారి తీస్తుందోనని రైతన్నలు మదనపడుతున్నారు.

'అంగన్‌వాడీలకు వేసవి సెలవులు ప్రకటించాలి'

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్27 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు ఇచ్చినట్టుగానే అంగన్‌వాడీలకు వేసవిసెలవులు ప్రకటించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాజేష్ నాయక్, క్రాంతికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఆదివారం వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

నిర్మల్‌కల్చరల్, ఏప్రిల్27 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ టౌన్-3 ఏరియాలో మహాలక్ష్మి ఫీడర్ మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9నుంచి 12వరకు అసౌకర్యం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉద్యోగాలు సాధించిన పలువురికి సన్మానం

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): వెంకటాద్రిపేట కాలనీలో ఉద్యోగాలు సాధించిన పలువురిని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆదివారం సన్మానించారు. ఉద్యోగ సంఘం అధ్యక్షుడు అనుముల రఘునాత్, మున్నూరు కాపు సంఘ అధ్యక్షుడు గొజ్జ సుదర్శన్, మాజీ కౌన్సిలర్ లక్కాకుల నరహరి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రితేష్ రాథోడ్

రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే

• రాష్ట్రాన్ని అప్పులపాలు చేసింది కేసీఆరే
• జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్

నిర్మల్‌కల్చరల్, ఏప్రిల్27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని జిల్లా బీజేపీ అధ్యక్షుడు రితేష్ రాథోడ్ స్పష్టం చేశారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని ఆరోపించారు. బీఆర్ఎస్ అవినీతిలో కాంగ్రెస్‌కు వాటా ఉందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన కోట్ల రూపాయల అవినీతిపై కాంగ్రెస్ నోరుమెదపడం లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిలో గిరిజన ఈఎన్‌సీ అధికారి హరిరామ్‌ను బాధ్యుడుగా చేయడం సమంజసం కాదన్నారు. బీఆర్ఎస్ కనుసన్నల్లో కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందన్నారు. కేసీఆర్ కుటుంబాన్ని జైలులో పెడతామన్న రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నిర్వహించే రజతోత్సవ సభ మరోమారు తెలంగాణ ప్రజలను మోసం చేయడమేనన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారన్నారు. రాష్ట్ర నాయకుడు లక్ష్మీనర్సయ్య, అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్, మేడిసెమ్మె రాజు, ఆకుల కార్తీక్, ఒడిసెల అర్జున్ పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీలో కొనసాగుతున్న సమ్మె

బాసర, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో అధ్యాపకులు ఆదివారం బాసర గోదావరి నదీతీరంలో గల శివాలయంలో తమ సమస్యలతో కూడిన వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ శివయ్య ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదన్నట్టుగా సీఎం రేవంత్‌రెడ్డికి రెగ్యులరైజేషన్ సమస్య పరిష్కారించే ఆజ్ఞ ఇవ్వాలని మొక్కుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బాలకృష్ణ,రమాదేవి,రాములు ,విజయ్ కుమార్, సతీష్ కుమార్,ప్రభాకర్ రావు, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులదే బాధ్యత

• ఎస్పీ జానకి షర్మిల
• మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక తనిఖీలు
• 296 మైనర్లకు కౌన్సెలింగ్



తనిఖీలు చేస్తున్న పోలీసులు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, కాదని వాహనాలు ఇస్తే అందుకు వారి తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎస్పీ జానకీ షర్మిల అన్నారు. ఆదివారం జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఏఎస్పీలు అవినాష్ కుమార్, రాజేష్ మీనా నేతృత్వంలో మైనర్ల డ్రైవింగ్‌పై జిల్లాలో ప్రత్యేక తనిఖీలు చేసి 296 మంది మైనర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. సుమారు 100 మందిపై మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదు చేశారు. వంద వరకు వాహనాలు స్వాధీనం చేసుకుని 296 మందికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పాఠశాల, కళాశాలలకు వెళ్లే పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వారికి వాహనాలు ఇస్తే వాహన చట్టం ప్రకారం తల్లిదండ్రులు, వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గత కొంతకాలంగా మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడుతున్నారని వారికి జరిమానా, కౌన్సిలింగ్ నిర్వహించి వదిలేస్తున్నామని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు ఇది గమనించి జాగ్రత్తగా ఉండాలన్నారు. అజాగ్రత్తగా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురైతే బాధపడతారన్నారు. రోడ్డు భద్రతలు ప్రతి ఒక్కరూ పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలన్నారు. కేసులు నమోదైన మైనర్లకు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మరోసారి అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి కౌన్సిలింగ్ నిర్వహిస్తారని వివరించారు.

ముథోల్‌లో పోలీసుల స్పెషల్ డ్రైవ్

ముథోల్: ముథోల్‌లో ఆదివారం నిర్మల్ ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు ముథోల్ సీఐ మల్లేష్ సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇస్తే చట్ట పరమైన చర్యలు తప్పవన్నారు. సరైన పత్రాలు లేని పలు వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్రతిఒక్కరూ వాహనాలకు నంబర్ ప్లేట్లు కనిపించే విధంగా పెట్టుకోవాలని, వాహనాలకు సంబంధించిన పత్రాలు దగ్గర పెట్టుకోవాలని సీఐ సూచించారు. ఈ సందర్భంగా మైనర్ పిల్లల పోషకులకు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. చిన్న పిల్లలకు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. చిన్న పిల్లలకు వాహనాలు ఇస్తే పోషకులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, నిబంధనలు పాటిస్తూ సంబంధిత వాహన పత్రాలు కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపరాదని, పలు సలహాలు, సూచనలు ఇచ్చారు.